క్లుప్తంగా

'ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం 2వ ఏఎన్ఎంలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో అక్టోబర్ 5 నుంచి మళ్లీ ఉద్యమ బాట పడుతామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సెకండ్ ఏఎన్ఎంలతో కలిసి తహసీల్దార్ రహీముద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పుష్పలత, సునీత, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

పెంచికల్‌పేట్: గ్రామాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నిరుపేదలకు దుప్పట్లు, టార్చిలైట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా, విక్రయించిన సమాచారం అందించాలని, గ్రామాభివృద్ధికి యువకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట దహెగాం ఎస్సై సనత్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వరీబాయి, ఉపసర్పంచ్ ప్రభాకర్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో గురువారం జరుగనున్న వినాయక చవితి నిమజ్జనానికి పంచాయతీ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఎస్సై దీకొండ రమేశ్ పరిశీలించారు. వినాయక నిమజ్జనం చేసే స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని నాగమ్మ చెరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఈవో కృష్ణమూర్తి, చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య, ఎంపీటీసీ తుకారాం, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, మల్కరి ప్రసాద్, కారం నాని, ఆశిక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా ఓటు వేసేలా చూడాలి

కెరమెరి: త్వరలో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నిస్వార్థంగా ఓటు వేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో మహేందర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఓటు వినియోగంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ దుర్గం శ్రావణ్‌కుమార్, ఆర్ఐ వివేక్, ప్రిన్సిపాల్ పరుశురాం, సెక్రటరీ బీమయ్య ఉన్నారు.

మృతుడి గుర్తింపు


హజ్జర్ హుస్సేన్ (ఫైల్)

దహెగాం: గత శనివారం మండలంలోని ఐనం పెద్ద వాగు పరిసరాల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కాగా మృతుడు కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై సనత్ కు మార్ తెలిపారు. మృతుడు కాగజ్‌నగర్ వాసి హజ్జర్ హుస్సేన్‌గా గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని నవగాం బస్తీ యూపీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బల్దియా సఫాయి కార్మికుల కోసం బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి శిబిరాన్ని సందర్శించి సఫాయి కార్మికులతో ముచ్చటించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పంచాయతీ కార్మికులు, నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో 33 రోజులపాటు సమ్మె చేసిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. హామీలు అమలు చేయని పక్షంలో తిరిగి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజు, కైలాస్, ప్రసాద్, సోనేరావ్, అనిల్ పాల్గొన్నారు.

భూమిపూజ

జైనూర్: మండలంలోని జామిని గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నిధులు మంజూరు చేశారని మాజీ సర్పంచ్ మడావి నాగోరావు అన్నారు. బుధవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

పీహెచ్‌సీ.. కాన్పుల్లో మెరిసి..!

- ప్రతీ నెలలో 40కి పైగా డెలివరీలు
- బుధవారం ఒక్కరోజే ఏడు కాన్పులు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో తగ్గిన ప్రసవాలు
- మెరుగైన సేవలందిస్తున్న కెరమెరి పీహెచ్‌సీ


కెరమెరి పీహెచ్‌సీలో బాలింతలు

కెరమెరి: ప్రతీ నెలలో దాదాపు 40 వరకు డెలివరీలు చేస్తూ కెరమెరి పీహెచ్‌సీ ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. రోజురోజుకూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. తాజాగా బుధవారం ఒక్కరోజే ఏడు కాన్పులు చేసిన ఘనత పీహెచ్‌సీకి దక్కింది.

120కి పైగా ఓపీ..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 156 గ్రామాలు ఉన్నాయి. 8 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 32,543 జనాభా ఉంది. వారంతా ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా కెరమెరి పీహెచ్‌సీకి రాక తప్పదు. ఇక్కడ ప్రతిరోజు 120కి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. పీహెచ్‌సీలో నలుగురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ప్రతీనెల 40కి పైగా డెలివరీలు నమోదై జిల్లాలో రెండో స్థానం, ఆసిఫాబాద్ నియోజక వర్గంలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది. కాగా బుధవారం ఒక్కరోజే తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు సిడాం సుమిత్ర స్టాఫ్ నర్సు ఒక్కరే 7 డెలివరీలు చేయడం గమనార్హం.

ఒక్క ఫోన్ కాల్‌తో..

మండలంలోని జోడేఘాట్, బాబేఝరి, పరంధోళి, అంతాపూర్, నిషాని, ఆగుర్‌వాడ గ్రామ పంచాయతీల్లో కొన్ని హైరిస్క్ గ్రామాలు ఉన్నాయి. కాగా ఆయా ప్రాంతాలకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోయినప్పటికీ ఒక్క ఫోన్‌కాల్‌తో వైద్య సిబ్బంది స్పందించి 108 వాహనంలో గర్భిణులను కెరమెరి పీహెచ్‌సీకి తీసుకొచ్చి డెలివరీ చేస్తున్నారు. గతంలో ప్రసూతి కోసం రూ.వేలు ఖర్చు పెట్టే గర్భిణులు ప్రస్తుతం ఇక్కడ మెరుగైన వైద్యం అందిస్తుండడంతో ప్రభుత్వ వైద్యంవైపు దృష్టి సారించారు. కాగా కెరమెరి పీహెచ్‌సీలో బాలింతలకు అప్పటికప్పుడు కేసీఆర్ కిట్లు అందజేస్తున్నారు.

ఒక్కరోజే ఏడు కాన్పులు..



మండలంలో అనేక మారుమూల గ్రామాలు ఉన్నాయి. గతంలో ప్రసూతి కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే వారంతా ప్రభుత్వ ఆసుపత్రుల వైపు చూస్తున్నారు. దీంతో బుధవారం ఒక్కరోజే ఏడు కాన్పులు చేశాను. మరో ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించాలి.

– సిడాం సుమిత్ర, స్టాఫ్‌నర్సు, కెరమెరి

సౌకర్యాలు భేష్



గర్భిణులు, బాలింతలకు సౌకర్యాలు భేష్‌గా ఉన్నాయి. వైద్య పరీక్షలు కూడా సవ్యంగా చేస్తుండడంతో డెలివరీ కోసం ఇక్కడికి వచ్చాను. బాలింతలకు ప్రత్యేకంగా గది కేటాయించారు. సమయానికి టిఫిన్, రుచికరమైన భోజనం అందిస్తున్నారు.

– మొహర్లే వెన్నెల, బాలింత, సాంగ్వి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పింఛన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆసరా లబ్ధిదారులకు ఆసరా పింఛన్ ఉత్తర్వుల పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా అందిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబీమా, రైతుబంధు పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఇటీవల కౌటాలకు చెందిన రైతు పర్వతాలు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమా చెక్కు అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఏవో రాజేశ్, సర్పంచ్ మౌనిశ్, ఏఈవో ఘనశ్యాం, కార్యదర్శి సాయికృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, నాయకులు నక్క శంకర్, రవీందర్ గౌడ్, గట్టయ్య, బాపు, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి శివాలయంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగ్గాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ పాల్గొన్నారు.

ఆశా, అంగన్‌వాడీలకు ప్రవీణ్‌కుమార్ మద్దతు


అంగన్‌వాడీల సమ్మెలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట విడివిడిగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఆశా వర్కర్లకు పనికి తగిన వేతనం అందించాలని పేర్కొన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, శారద, మోక్ష, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అర్షద్ హుస్సేన్, మండలాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు గోవింద్‌రావు, నాగయ్య, రాంప్రసాద్, నవీన్, నక్క శంకర్, ఆనంద్, సాగర్, ఆశా వర్కర్లు మోగ్ర, లక్ష్మి, సుజాత, కాంత, అర్చన పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల మానవహారం

కెరమెరి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వరకు వివిధ రకాల నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చి ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, అనసూయ, స్రవంతి, కవిత, గుణసుందరి, అయ్యూబాయి, సంగీత, బొజ్జుబాయి, లింగుబాయి, అనిత, ప్రమీల, తిరువన, గంగుబాయి, రేణుక తదితరులు ఉన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేసి స్థానిక డౌనల్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న ఆశా వర్కర్ల సమ్మె

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్ల సమ్మె బుధవారం 3వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ప్రమాదబీమా రూ.5 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరుణ, భారతి, సావిత్రి, దుర్పత, నీలాబాయి, లక్ష్మి, లలిత, సరోజా ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఒకవైపు అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె సాగిస్తుండగా, మరోవైపు గత మూడు రోజుల నుంచి తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని కోరుతూ ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదేలు అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమ్మె శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపారు.

పెంచికల్‌పేట్: డిమాండ్లను నెరవేర్చాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, చౌదరి బండు, గణపురం బాపూజీ, అతహాబేగ్ పాల్గొన్నారు.

బెజ్జూర్: ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు చేపడుతున్న సమ్మె బుధవారం 3వ రోజుకు చేరుకుంది. ఆయన సమ్మెకు మద్దతు తెలిపారు. సునీత, సరోజ, రాజేశ్వరి, విమల, భాగ్య, రజిత పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


వాంకిడి: బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

వాంకిడి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ ఒక్కరు బాపూజీని ఆదర్శంగా తీసుకుని పుట్టిన గ్రామానికి సేవలు అందించాలని లైబ్రేరియన్ సదానందం సూచించారు. గ్రంథాలయ సిబ్బంది అశోక్, యువకులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ కార్యాయంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ తఫీమా పర్వీన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ తోట మహేష్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఈవో కృష్ణమూర్తి, వార్డు సభ్యులు ఇఫాత్‌హుస్సేన్, మోయిజ్, మల్కరి ప్రసాద్, సంతోష్, గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యుడు ఆశిక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పద్మశాలీ మహిళ సంఘం మండలాధ్యక్షురాలు మార్త చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ ఆలయ ఆవరణలో బుధవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు రేఖ, కల్యాణి, సునీత, కృష్ణవేణి, విజయలక్ష్మి, శ్రీనివాస్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధులు, తొలితరం ఉద్యమదారులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి మల్లయ్య, గౌరవ అధ్యక్షులు రాజయ్య, రాష్ట్ర నాయకులు శంకర్‌లు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, పుష్పలత, సంజీవ్, లక్ష్మి, శ్రీనివాస్, మధుకర్, సత్యనారాయణ, రాజమౌళి, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో బీసీ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆవిడపు ప్రణయ్, పురుషోత్తం, బాలేష్, మారుతి, ప్రశాంత్, ఉమేందర్, తరుణ్, సిద్దార్థ, జశ్వంత్, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు నాంపల్లి శంకర్, అచ్యుత్‌రావు, మధుసూధన్‌గౌడ్, పుల్లూరి కిష్టయ్య, శంకర్, తుకారాం, సిరాజ్ ఉల్ హుక్, బండారి వెంకటేశ్, సుభాష్ సింగ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్ ఆదేశాల మేరకు స్థానిక ఎల్లాగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శిశుమందిర్, వాసవీ విద్యామందిర్, శారదా గణేశ్ మండలి వద్ద నెలకొల్పిన గణనాథులను ఘనంగా నిమజ్జనం చేశారు. బ్యాండ్ మేళాతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక పెద్దవాగులో గణనాథులను నిమజ్జనం చేశారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, నిర్వాహకులు పుల్లూరి రవీందర్ శారదా గణేశ్ మండలి వద్ద నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

దహెగాం: నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడిని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంతో పాటు చినరాస్పెల్లి, తదితర గ్రామాల్లో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

రెబ్బెన: మండల కేంద్రంతో పాటు గోలేటి, నంబాలలో వినాయక నిమజ్జనాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో వినాయకుడికి స్వాగతం పలుకుతూ పూజలు చేశారు. యువకులు, మహిళలు, చిన్నారులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. ఎంపీపీ సౌందర్య, సర్పంచులు అహల్యాదేవి, సోమశేఖర్, సుమలతలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఐ అల్లం నరేందర్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఎలుకపెల్లి చిన్నసిద్దాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.


ఆసిఫాబాద్: శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు


రెబ్బెన: దాండియా ఆడుతున్న మార్వాడీలు


దహెగాంలో..


ఆసిఫాబాద్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు


రెబ్బెన: శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

టెట్‌లో ఉత్తమ ఫలితాలు


అనిల్


అశోక్


రోజా

పెంచికల్‌పేట్: ప్రభుత్వం విడుదల చేసిన టెట్ పేపర్ 1 ఫలితాల్లో మండలంలోని పలువురు అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఎల్లూర్ గ్రామానికి చెందిన నల్లగొండ అనిల్ 129 మార్కులు, చేడ్వాయి గ్రామానికి చెందిన నందిపేట్ అశోక్ 125 మార్కులు, రోజా 122 మార్కులు సాధించారు. 20 మందికి పైగా యువకులు వంద మార్కులు సాధించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, చర్చల ప్రతినిధి దారావత్ మంగీలాల్‌లు బుధవారం ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిశారు. కార్మికులకు అండగా ఉంటూ హక్కుల సాధనకు కృషి చేస్తున్న కవితకు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ కమిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వల్లకొండ గ్రామపంచాయతీ సీతానగర్ (సోమయ్యగూడెం) గ్రామంలో అంబేద్కర్ కమిటీహాల్ భవన నిర్మాణానికి బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భూమిపూజ నిర్వహించారు. రూ. 7.50 లక్షలు మంజూరు కాగా, పనులకు శంకుస్థాపన చేశారు. గంగన్నగూడెం అంబేద్కర్ కమిటీహాల్ భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.4 లక్షలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురు శెట్టి శంకర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు స్వదేశ్ శర్మ, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, సర్పంచ్ మౌలకర్ సునీత, మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, నాయకులు ధన్‌రాజ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా విద్యుత్ అందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: జీవో నంబర్ 342 ప్రకారం దళిత కుటుంబాలకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. బుధవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ రూరల్ ఏఈ జగన్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు డోంగ్రి మహేశ్వర్, నాయకులు రత్నం రాజు, డోంగ్రి విలాస్, సోమేశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

రెబ్బెన: మండలంలోని పాశిగాంలో టీజీబీ, రెబ్బెన శాఖ ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్, హైదరాబాద్‌కు చెందిన కళాజాత సంస్థ కళాకారులు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు దుగ్యాల సునీత, గొగికార్ నరేశ్, సర్పంచ్ శ్రీనివాస్, అకౌంటెంట్ శివాణి, రైతులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో కోలవార్ (మన్నెవార్) సేవా సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు కాగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి బుధవారం సంఘ నాయకులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు కృతజ్ఞతలు తెలిపారు. లోడుపల్లి సర్పంచ్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, సంఘం మండల అధ్యక్షుడు సత్యన్న, శేఖర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: మిషన్‌భగీరథ నీటి వినియోగంపై ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీవో గౌరీశంకర్, ఏఈ రవికుమార్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేయాలి

రెబ్బెన: ప్రజలు తమ సమస్యలపై స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి బస్టాండ్, పల్లెప్రకృతి వనం, ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద బుధవారం స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో గంగాసింగ్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించి చెత్తాచెదారం తొలగించారు. సర్పంచ్‌లు కావ్య, చంద్రమౌళి, సంజీవ్, ఎంపీటీసీ రాజన్న, డెప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, రమాదేవి, ఏపీవో పాల్గొన్నారు.

'నవోదయ'లో స్వచ్ఛత ప్రతిజ్ఞ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం జవహర్ నవోదయ విద్యాలయంలో 'స్వచ్ఛతా హీ సేవా- 2023' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య, ప్రిన్సిపాల్ చక్రపాణి, ఉపాధ్యాయులు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డి.ప్రణీల్, మెప్మా డీఎంసీ జె.మోతీరాం, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరపాలి

కెరమెరి: నేడు మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై గుంపుల విజయ్ బుధవారం కోరారు.